కొత్త జీవితం

శ్రీ కళ్యాణి

"ఇంతకీ మీరు విచారిస్తున్నారా?" అన్నది జానకి.

"దేనికి?" అన్నాడు భాస్కరం.

''అదేనండి, నన్ను పెళ్ళిచేసుకున్నందుకు!" అంది జానకి చిరుకోపంతో.

"ఆ ప్రశ్న పదిహేనేళ్ళ తర్వాత అడుగుతున్నావా?" - అన్నాడు భాస్కరం కొంటెగా.

"కొన్నేళ్ళపాటు కాపరం చేశాకనే అడగవలసిన ప్రశ్న అది. నిజం చెప్పండి" అంది గోముగా జానకి.

"నీకేమనిపిస్తోంది చెప్పు?"

స్వెటర్ అల్లిక ఆపి, చుట్టూ చూసింది

జానకి పెద్దవాడు రామం గిటార్ పట్టుకుని ఏదో రాగం పలికించటానికి ప్రయత్నిస్తున్నాడు. సుమిత్ర ఓ నవల్లో తనచుట్టూ ప్రపంచాన్ని మర్చిపోయి, మునిగిపోయింది. ఆఖరివాడు బాబు 'మెకానిక్' తో కుస్తీపడుతున్నాడు. ఇహ అతను భోజనం కానిచ్చి హాయిగా సిగరెట్టు కాల్చుకుంటూ ఉదయం చదవగా మిగిలిన న్యూస్ పేపర్ని చూస్తున్నాడు. ఎవరిలోనూ అసంతృప్తి గాని, చికాకుగాని లేదు.

"నాకు తృప్తిగానే ఉంది సుమండీ!" అంది జానకి.

"నాకూ అంతే. కాని, జానీ! నువ్వా రోజుల్లో కలవకపోతే మనమీరోజు ఇలా ఉండేవాళ్ళమంటావా? మొదట్లో నిన్ను చాలా నే తిట్టుకున్నా. 'హాయిగా ఉన్నవాడిని వదిలిపెట్టదేమిటా' అని. కాని ఇపుడుమటుకు..."అంటూ సగంలోనే ఆపి ఆప్యాయంగా చూశాడు-భార్యవేపు;

"కాని ఈ 'హాయి' మనది కావటానికి ఎంత కష్టపడ్డాం!"

"ఫలితం దక్కిందికదా మరి?"

"కాదని అనగలనా?"

"కాని ఆ రోజుల్లో నన్ను తెగ బాధపెట్టేశావు సుమీ! శ్రీనుని కూడా చాలా తిట్టుకున్నాను." ఇప్పుడు ఎక్కడో దూరంలోవున్న శ్రీను, ఈ ఢిల్లీలోనే తను పూర్వం గడిపిన జీవితం జ్ఞాపకంవచ్చినవ్వుకున్నాడు-భాస్కరం.

నిజమే! భాస్కరం అప్పట్లో పెళ్ళాడ తగ్గ బ్రహ్మచారి. చదువూ, ఉద్యోగం దృష్ట్యా చూస్తే. అతనిలోని లక్షణాలు కొన్నిమటుకు పెళ్ళికూతుళ్ల తండ్రుల్ని దగ్గరకురాకుండా ఆపినాయి...ఒకటి-అప్పుడప్పుడు అయినా తాగటం, రెండు - అతనికివున్న లెక్కలేనంత మంది కాకపోయినా, గర్ల్ ఫ్రెండ్స్. అతను జాన్సన్ అండ్ జాక్సన్ లో పని చేసేవాడు. ఆఫీసులో రిసెప్షనిస్ట్ కేథరిన్ దగ్గర్నుండి పక్కింటి సిన్హాగారి అమ్మాయి ఆశతోసహా అందరూ అతనితో జంటగా పిక్నిక్కులకూ, షైర్లకూ వెళ్ళినవాళ్ళే. వీలయినంతవరకు ఒకరికి తెలియకుండా ఇంకొకర్ని మేనేజ్ చేసేవాడు - అతని స్నేహితులెవరయినా.

"ఇది తప్పయ్యా. అల్లా చేయకూడదు. ఆడపిల్లల్ని అలా పాడు చేయొచ్చా?" -అంటే.

"చూడు బ్రదర్, నేనయినేను వాళ్ళ వెంటబడి ఏమయినాచేస్తే బాధ్యత నాదవుతుంది. మరి 'హల్లో, సాయంకాలం మీకు మరేం పనిలేకపోతే, ఇంటికేసి రారూ?' అంటూ ఆహ్వానాన్ని కళ్ళలో నింపుకుని అడిగితే రానని అంటావా?" అనేవాడు.

"అనను"

"మరి, 'ఇంకా తెలుగుపుస్తకాలు లేవాండి' అంటూ మాటిమాటికి పైట సరిచేసుకుంటూ, కొంటెచూపులు చూసే పదిహేడేళ్ళబాలను చూసి నీ మనస్సు చెదిరిపోదూ?"

"పోతుంది."

"మీతోబాటు ఆ సీరియల్ చదవద్దూ - అంటూ పక్కనే కూర్చుని చక్కటి అమ్మాయి మీద పడుతూంటే నువ్వు చేతకాని చవటలా ఊరుకుంటావా?"

"ఊరుకోను "

"మరి నన్నెందుకయ్యా - ఆడిపోసుకుంటారు? ఛాన్సు దొరికితే వదిలేవాళ్ళెవరు? పైగా నీతివాక్యాలు - పోనీ, నేనేమయినా నవమన్మథుణ్ణా?"

"అబ్బే, ఆలోచించకుండా కాదని చెప్పచ్చు. కాని వీళ్ళంతా నీ వెంట ఎందుకు పడుతున్నట్టు?"

"అదా?" కొంచెం ఆలోచించి అన్నాడు భాస్కరం.

"చూడు, వాళ్ళకు తెలిసిన మిగిలిన అబ్బాయిల్లా నేను జంగ్లీని కాను. చక్కగా కబుర్లు చెబుతాను. తర్వాత నేను చాలా నమ్మకస్తుడినని వాళ్ళ అభిప్రాయం. వాళ్ళంటే పడిచావను. నువ్వు రంభలా ఉన్నావని చచ్చినా అబద్ధం చెప్పను. అదేనేమో నాలోని ఆకర్షణ."

అలాంటి భాస్కరం, జానకి కలిసి తిరుగుతున్నారనేసరికి అందరూ ఆశ్చర్యపోయారు. జానకి, శ్రీనివాస్ అన్నాచెల్లెళ్ళు. జానకి అన్నయ్యదగ్గరే ఉండి ఇంద్రప్రస్థలో ఎకనమిక్స్ లెక్చరర్‌గా పనిచేసేది. ఆమె కొలీగ్ అరుణ అస్తమానం "మా భాస్కర్" అని చెబుతూంటే కుతూహలంగా వినేది. ఓమారు శ్రీనివాస్‌తో ఆమె అతని గురించి చెప్పేసరికి అతను -

"భాస్కరా? జాన్సన్ అండ్ జాక్సన్‌లో ఉన్నాడు, అతనేనా?" అన్నాడు.

"అవునన్నయ్యా, నీకెలా తెలుసు?" అంది జానకి. తనేదో కొత్తవిషయం చెబుతున్నాననుకుని చెబితే అతనలా అనటంతో తెల్లబోతూ.

"తెలుగువాడుకదా మరి, తెలీక పోతుందా? ఆమధ్య పెదనాన్నగారు శశిని ఈ అబ్బాయి కిద్దామనుకుని వాకబు చెయ్యమంటే చేశాను. అన్ని సంగతులూ తెలిశాయి అతను చదువుకున్నాడనుకో, మంచి ఉద్యోగమే. కాని తాగుతాడట. మీ కరుణలాంటి స్నేహితురాళ్లు ఎంతమందోనట. అచ్చం గోపాలకృష్ణుడేననుకో." అన్నాడు- కొంచెం తిరస్కారంతో శ్రీనివాస్.

"అయితే ఓమారు ఇంటికి పిల్చుకు రాకూడదూ" అంది జానకి కుతూహలంతో.

"ఏంవి.. టీ!" కుర్చీలోంచి ఎగిరి గంతేసినంత పనిచేశాడు శ్రీనివాస్.

"ఏమీలేదు, ఇంటికి పిల్చుకు రాకూడదా? అన్నానంతే;" అంది జానకి తన కుట్టుపనిని ఆపకుండానే.

"ఎందుకు?" కొంచెం దూకుడుగానే అన్నాడు-శ్రీనివాస్.

"మరేంలేదు, కరుణేమో 'చాలా మంచివాడు అదీఇదీ' అని చెబుతోంది. నువ్వేమో ఇలా మాట్లాడుతున్నావు? ఎలా ఉంటాడో, ఎలాంటివాడో నిజానికి చూద్దామని-అంతే" అన్నది జానకి తాపీగా.

"అమ్మాయ్! ఇలాంటి కుతూహలమే ఎంతలేసివాళ్ళనీ గోతిలోకి దింపేది. అతని సంగతి నాకు బాగా తెలుసు. జాగ్రత్త" అన్నాడు శ్రీనివాస్-తేల్చేస్తూ.

"నేను ఏ గోతిలోకీ తెలీకుండా మటుకు దిగను" అంది జానకి కుట్టుపనిని ఎత్తిపెట్టేస్తూ...చెల్లెలి సంగతి తెలిసిన శ్రీనివాస్ ఇంకేమీ మాట్లాడలేదు. అంతటితో ఆ ప్రస్తావన ఆగిపోయింది.

ఆ వారంలోనే ఏదో సినిమాకి కరుణని తీసుకువెళ్ళటానికి వచ్చిన భాస్కరాన్ని కరుణే పరిచయంచేసింది. సన్నగా పొడుగ్గా ఉన్న అతన్ని పరీక్షగా చూసింది జానకి, చాలా మర్యాదగా మాట్లాడుతున్నాడతను. అతని ఛలోక్తులు కూడా చాలా తీక్షణంగా ఉన్నాయి. అక్కడ అతనువున్న పది నిమిషాల్లోనూ కరుణ భాస్కరానికిచ్చిన రూపం నిజమయింది కాదు, అతని నిజమయిన వ్యక్తిత్వాన్ని ఛలోక్తుల, నవ్వులచాటున దాచేస్తున్నాడనుకుంది జానకి. కుతూహలంగా, పరీక్షగా చూసే ఈ అందంలేని అమ్మాయిగురించి పట్టించుకోలేదతను.

అందుకే ఓ వారం తర్వాత ఓ సాయంత్రం కన్నాట్ ప్లేసులో 'అమెరికన్ ఎక్స్‌ప్రెస్' ఆఫీసులో ఏదోపని చూసుకుని హడావిడిగా వస్తూంటే కనపడి.

"నమస్తే" అన్న ఆమెని వెంటనే పోల్చుకోలేదు భాస్కరం.

"కరుణ ... ఇంద్రప్రస్థ" అంటూ జ్ఞప్తికి తెచ్చింది జానకి.

ఎస్! జ్ఞాపకం వచ్చింది. మీ రెటు వెళుతున్నారు?" అన్నాడు భాస్కరము-తన తొందరపాటునుకప్పిపుచ్చుకుంటూ. 'అయిదు ముప్పావయింది, సలీమా చిరాకు పడిపోతుంది' అనుకున్నాడు.

"మీ రెటు వెడుతున్నారు? తనకు జవాబివ్వకుండానే ఎదురు ప్రశ్న వేస్తున్న అమ్మాయివల్ల కలిగిన చిరాకులో మరి ఆలోచించకుండా.

"చా తీసుకోటానికి," అన్నాడు.



"నేనూ అంతే. కలిసివెళ్ళటానికి మీ కేమయినా అభ్యంతరమా?"

'అవును' అని చెప్పాలనిపించినా దిగమింగుకుని.

"పదండి, అభ్యంతర మేముంది?" అన్నాడు.

అయిష్టంగానే ఆమెతో అడుగులు వేశాడు. ఇన్నాళ్లూ అందమయిన అమ్మాయిల పక్కన నడిచి అలవాటు పడిన అతనికి ఈ అమ్మాయితో నడవా లంటే ఎలాగో ఉంది. బిగుతుగా వేసుకున్న జడ, ఉదయం ఎప్పుడో మేకప్ అయి ప్రస్తుతం కాస్త జిడ్డుగా ఉన్న మొహం, అతిసామాన్య మయిన చీర. అతిసామాన్యంగా ఉన్న ఆ అమ్మాయిని చూస్తే అతనికి తమాషాగా అని పించింది. అవును, పెదాలకు లిఫ్ స్టిక్, బుగ్గలకు రోజ్ లేని అమ్మాయిల మొహం చూసినఅలవాటు లేదు; మరి. ఆతనిదా పొరబాటు?

అలా తన ఎంగేజ్ మెంట్ని పాడు చేసి, సలీమాకి కోపం తెప్పించిన జానకంటే ఎంత ఒళ్లుమండినా, తెలివిగా మెరిసేకళ్లూ చకచకా చెప్పే కబుర్లతో ఆ అమ్మాయంటే మొదట ఉన్న అయిష్టం పోయిందతనికి. నిజానికి గదికి వెళ్ళేదాకా సలీమా గుర్తుకు రాలా.

మరుచటి రోజునుండి మామూలే - అతనూ అతని షికార్లమధ్యలో జానకిని గుర్తు తెచ్చుకోవాల్సి రాలేదు.

ఆ రోజు ఆఖరినిమిషంలో రాలేనని ఆశ ఫోన్ చేసేసరికి చాలా నీరసించిపోయాడు. ఆ రోజు కేథరిన్, నిరుపమ, కరుణ ఎవరికీ తీరుబడిలేదు. చివాగ్గా కనీసం గొంతయినా తడుపుకుందామని బయలుదేరి నాలుగడుగులు వేసేసరికి ఎదురుగుండా నవ్వుతూ కనిపించింది జానకి.

"హాలో! ఈ మధ్యను ఊళ్ళో లేరా?" అంటూ పలకరించిందామె.

"లేకేమండి! ఏంవిటి - చాలా కులాసాగా ఉన్నట్టున్నారే!" అన్నాడు భాస్కరం, టీజ్ చేస్తున్నట్టుగా.

"మీకు తెలీదేమోగాని నే నెప్పుడూ కులాసాయే ... ఇపుడే కరుణ ఇచ్చిన పార్టీనుండి వస్తున్నానండి. తనకి పెళ్ళి సెటల్ అయింది కదా!"

"అవునవును" అంటూ వ్యంగ్యంగా నవ్వుకున్నాడతను, ఆ పెళ్ళిగొడవంతా తల్చుకుని.

"మా ఇంటికి టీకి రాకూడదూ? మరో ఎంగేజిమెంట్ ఏమీ లేకపోతే" అంది జానకి కొంటెగా చూసి.

ఒక్కనిమిషం తెల్లబోయాడతను. "అబ్బే. మరో ముఖ్యమయిన పనేం లేదులెండి," అన్నాడు సర్దుకుంటూ.

"నిజం?" అంటూ ఇంటికి దారితీసింది జానకి. ఆ అమ్మాయితో ఎందుకో అంతా చెప్పుకో బుద్దేసింది-భాస్కరానికి. ఆశ, సలీమా లందరి గురించి చెప్పాడు-అంతా విని.

"ఇంతకీ వీళ్ళలో ఎవరిమీదయినా మీకు గాఢమయిన అనురాగంలాంటిది, అదేదో ప్రేమ అంటారు చూశారూ-అది ఉందా?" అంది సగం సీరియస్ గా.

"చూడండి. నే నేదో ప్రేమలో ఉన్నానని, వాళ్ళకి నే నంటే అచలమయిన విశ్వాసం ఉందని నే ననుకోవటంలేదు. మరికొంచెం బ్లంట్ గా చెప్పాలంటే నాకు వాళ్ళతో అవసరం ఉంది. వాళ్ళకి నాతో బంధం అటువంటిదే - కాలక్షేపం. వాళ్ళకోరికల్ని తీర్చుకోవటానికో మార్గం-ఇహ ప్రేమలాంటివి మామధ్య రావటానికి ఆస్కారం ఏదీ?"

"మరి మీకు ఆప్తులు, స్నేహితులు అంటూ లేకపోతే మరి చాలా వంటరిగా ఫీలవరా?"



"ఈ వంటరితనం నాకలవాటే. కిండర్ గార్డన్ నుండి చదువంతా పై ఊళ్ళోనే జరిగింది. ఆ తర్వాత కారణాంతరాలవల్ల మా తల్లిదండ్రులకూ నాకూ పడలేదు. ఆఖరికి తోడబుట్టినవాళ్ళుకూడా దూరంగా ఉండటానికే ప్రయత్నించారు. మనసుని గాయపరిచే సంఘటనలు చాలానే జరిగాయి. అందుకనే "ఏకాకిని - ఏకాకిగానే ఉంటాను," అని అప్పుడప్పుడూ నాకు వేనే ధైర్యం చెప్పుకుంటూ ఉంటాను. అయినా అలాంటి సమయాల్లో 'సీసా' తోడునీడగా ఉండనే ఉంటుంది. ఇక, వంటరిగా ఉన్నానని అనుకునే సమయము ఏదీ? అసలు దేనిగురించయినా ఆలోచించే వ్యవధి ఏదండి?"

"నేను మీకన్నా చిన్నదాన్ని. మీకు చెప్పగలదాన్ని కాను. అయినా వ్యవధి కల్పించుకోండి. అప్పుడీ రకమయిన సంబంధాలు అర్థవిహీనంగా కనిపిస్తాయి," అని సంభాషణ ఆపేసింది జానకి-ఇల్లు దగ్గరికి రావటంతో.

ఆ రోజు సాయంకాలం అతనికి తెలీని కొత్తరకం సంభాషణలో పాల్గొన్నాడు భాస్కరం, అన్నాచెల్లెళ్ళ మధ్య సున్నితమయిన హాస్యం, ఆప్యాయత, సునిశితమయిన వాగ్బాణాలు- అతనికి ఇలాంటివ్యక్తులూ ఉన్నారనిపించేలా చేసింది.

"మళ్ళీ ఇంకోమారు తప్పకుండా రండి," అన్నది జానకి.

"ఇహ మీ ఆహ్వానానికోసం ఎదురు

చూడను. నాకు వీలున్నపుడు వచ్చేస్తా నంతే!'' అన్నా డతను.

జానకి దగ్గర అతనలా మనసు విప్పి చెప్పుకోగలిగేవాడు. అప్పుడూ, ఆ తర్వాతకూడా, ఇప్పటి జీవితానికి అల వాటుపడిన అతనికి ఆ ఇంట్లో తనకింత వరకూ తెలీని శాంతి ఏదో లభించిన ట్లయింది. ఆ అట్టే అందంగాలేని ఈ అమ్మాయి ఓ మంచి స్నేహితురా లిలా అనిపించింది - అంతే. ఓ రోజున అతను తనవిజయాల్ని గురించి చెబు తూంటే.

"మీ నిజాయితీని చూ స్తే భయం వేస్తుందండీ!" అందామె.

"అంత భయంకరంగా ఉన్నానా?"

"అలా కాదు, మిమ్మల్ని కట్టు కున్నది ఈ నిజాల్ని తట్టుకోలేక పోతుందేమో!"

"నాకు కనుచూపు మేరలో పెళ్ళి చేసుకోదగిన వ్యక్తి కనబడటం లేదు. ఆ మాత్రం నిజాల్నితట్టుకో లేని అమ్మాయిని నేను చేసుకోన్లెండి "

ఒక్కోమారు జానక్కి కోపం వచ్చేది, -మరి ఆడదంటే ఇంత తేలిక భావమా అని-అదే అంతే.

"ఆడవాళ్ళతో మీ అనుభవం ఎంత? నా అనుభవంలో నాలుగోవంతయినా ఉందా?" అని సవాలు చేసేవాడు. ఓటమిని ఒప్పుకోక తప్పేదికాదు.

నిజమే! ఎప్పుడూ సలీమాలనూ, ఆశలీన్ని. కేథరిన్లనూ చూస్తున్న అతనికి స్త్రీ అంటే గౌరవభావం ఎలా కలుగు తుంది?

ఓమారు జానకిని, హఠాత్తుగా ఓ ప్రశ్న వేసి, ఇబ్బందిలో పెట్టేశాడు- భాస్కరం.

"మీరు ఒక్క అఫైర్ కూడా లేకుండా ఎలా ఉంటున్నారండీ?''

ఒక్కనిమిషం తడబడినా వెంటనే సర్దుకుంది జానకి.

"లేదని ఎందుకనుకుంటున్నారు?"

"నాకు తెలిసినంతవరకూ లేదు మరి. మీరు అలా రహస్యాలను దాచ గలరని అనుకోను.''

"మహానుభావా! మీకు ఆడదాని ఒక్క రూపం కొంచెం తెలిసేసరికి అంతా తెలుసనుకుని గర్వపడిపోతున్నారు. ఆడది రహస్యమయి; అవునోకాదో మీకేం తెలుసు? ఆ విషయం ఇక వది లెయ్యండి.'' అంది జానకి.

భాస్కరానికి ఆమె అంటే ఒక్కటే తెలుసు-తనకు తెలిసిన అమ్మాయిల కోవకి చెందదు, వాళ్ళలా చీర నలిగి పోతుందేమోనని బెంగెట్టుకోదేమో; లిప్‌స్టిక్ మేడ్ చీరరంగుకి నప్పిందా లేదా నని మాటిమాటికీ వేధించదు.

మరింకా ఓ సుగుణం ఏమంటే ఆమెతో ఏ విషయాన్ని గురించయినా నిస్సంకోచంగా మాట్లాడొచ్చు. దేని గురించి మాట్లాడినా అర్థం చేసుకో

గలిగే శక్తి ఉంది. తనకీమధ్య కొన్ని విషయాల్లో తగ్గిపోతున్న ఆసక్తి గురించి చెబుతూ,

"నాలాంటి వాళ్ళకో ఇబ్బంది ఉన్న దండీ. ఆఫీసు వదిలాక నాతో మగ వాళ్ళు మాట్లాడేదంతా వైన్ అండ్ విమెన్ గురించి. ఆడవాళ్ళ సంగతి మీకు తెలుసు. అందుకే మీ కంపెనీలో ఓ రకమయిన శాంతి దొరుకుతుంది. సెక్స్‌తో సంబంధంలేని ఓ స్నేహితురా లుంటే బావుండుననిపిస్తుంది."

అతనికేమయినా చికాగ్గావుంటే తిన్నగా ఆమె దగ్గరికి వచ్చేవాడు,

కాని అల్లా అతను వచ్చిన ఓ రోజుని ఎన్నటికీ మర్చిపోలేదు జానకి.

సాయంకాలం ఆఫీసునుండి తిన్నగా వచ్చేశాడతను.

"అదేం, ఇవాళ సాయంకాలం నిరుపమతో ఎక్కడికో వెళ్తున్నానని చెప్పారు!" అంది జానకి ఆశ్చర్య పోతూ.

అతను మండిపడుతూ అన్నాడు, "అసలు ఆడవాళ్ళకి సెన్స్ ఆఫ్ ఆనర్ లేదండీ! లేకపోతే నాతో ఆఫీసుకి వస్తానని, కలిసిపోదామని చెప్పిన అమ్మాయి వచ్చి, నా పక్కనే వున్న మిత్రాతో కలిసి వెళ్ళిపోతుందా? దీనికంతా కారణం తెలుసా? నేను నిన్న సుషుమాఛటర్జీతో వెళ్ళటం చూసిందిమె! వాళ్ళిద్దరికీ ఒకరంటే ఒకరికి పడదు; గనుక నేను ఎవరి నయినా ఒకర్ని ఎంచుకోవాలిట. అయినా నేను ఆమె ఎవరితో తిరగాలో తిరక్కూడదో శాసిస్తున్నానా, ఆవిడ గారు నన్నిలా అనటానికి? మధ్యాహ్నంనుండి 'నీకేమోయ్, అందమయిన అమ్మాయిలందరూ నీ వెంటే ఉంటారం'టున్న మిత్రా ఇలాంటి పని చేస్తాడా? అసలు..."

"తప్పంతా మీలో ఉంచుకుని వాళ్ల నంటారేం?" అంది జానకి ఆవేశంగా మధ్యలోనే.

"తప్పా! నేనేం చేశాను?" చాలా అమాయకంగా అన్నాడు భాస్కరం.

"తప్పు కాదూ! కొంచెంకూడా ఆత్మాభిమానాన్ని ఉంచుకోక అందరికీ అలా అలుసివ్వబట్టే కదా - అలా అయింది. అసలు మీ సంబంధాలే అలాంటివి. అర్థం పర్థంలేని అసూయలు. అసలు 'ఓహో, ఎంతటి ఆనందం' అంటూ ఇలాంటి సంబంధాలు పెంచుకుని, ఆవ్యామోహపు పొంగు ఆరగానే 'ఏమిటి మిగిలిందంటూ!' గంతులేస్తారు. ఇలాంటి బ్రతుకూ ఓ బ్రతుకే! ఈ మాత్రం ఆలోచించగల శక్తి ఉన్న మీరే ఈ ఊబిలోదిగి ఇలా నాశన మయితే ఎలా? మీకో వ్యక్తిత్వం అంటూ ఉంటే అసలు ఇన్నేళ్ళు ఇలాంటి జీవితాన్ని గడపగలుగు

తారా?" తనకు తెలియకుండా గట్టిగా అరచింది జానకి.

ఎన్నడూలేనిదీ ఒక్కమారు ఇలా మనసులో ఉన్నదంతా వెళ్ళగక్కేయ టంతో ఆమె మొహం ఎర్రబడి పోయింది భాస్కరం ఒక్క మారు తెల్లబోయి ఆమెవేపు చూసి.

"అయితే...అయితే... మీరు ... నన్ను" అని - ఇక ఆపేశాడు. జానకి లోపలి కెళ్ళిపోయింది.

భాస్కరానికి వెళ్ళాలో ఉండాలో తెలీలేదు. అతను లేవబోతూండగా శ్రీనివాస్ వచ్చి.

"అదేమిటండోయ్, ఒక్కరే కూర్చు న్నారే," అంటూండగానే జానకి టీ కప్పులతో వచ్చింది. చల్లటినీళ్ళతో మొహం కడుక్కుని వచ్చిన ఆమె మొహం ఎప్పటిలా ప్రశాంతంగా, నిర్మలంగా ఉంది. ఆమెనలా చూశాక తన అభిప్రాయం తప్పేమో ననిపిం చింది

కాని ... జానకి వాళ్ళన్నయ్య సూచించిన సంబంధా లన్నిటినీ తిర స్కరించటంతో తన అనుమానం నిజమే ననిపించింది. ఆ సందిగ్ధంలోపడి ఓ రెండువారాలపాటు ఆమెతో ఎప్ప టిలా మాట్లాడేవాడు కాదు. అది గమనించి జానకే ఆ ప్రసక్తి తెచ్చింది.

"ఏమండీ! ఆ రోజున అలా మాట్లాడే నని కోపం వచ్చిందా?"

"కోపంకాదు...కాని మీరు మరోలా అనుకోనంటే ఓ మాట అడగనా?"

"ఏమీ అనుకోనుగాని -అడగండి."

"నే నేమయినా తప్పుమాటఅన్నా, మనమధ్య ఈ స్నేహం ఏమీ కాకూ డదు."

"ఏమీ కాదు."

"మీకు నేనంటే స్నేహితుడినన్న భావంకాక మరేదయినా భావం ఉందా?" ఆ ఒక్క ప్రశ్నావేసేసి నిట్టూర్చాడు భాస్కరం-ఏదో బరువు తీరినట్టు.

"ఆ ప్రశ్న ఎందుకని వే యా ల్సి వచ్చింది."

"ఆ రోజున మీరు మా ట్లా డి న విధానం చూ స్తే నాకు అనుమానం వేసింది."

"మీరు నాకు మంచి స్నేహితులు. మీరు బాధపడుతూంటే దగ్గరికి తీసు కుని ఓదార్చాలని ఉంటుంది. మీరు హా యి గా ఉంటే, ఆ హాయి నా మూలంగా వచ్చినది అంటే, చాలా తృప్తిగా ఉంటుంది. అలా ఇ ద్ద ర ం నవ్వుతూ గడిపితే, జీవితాంతం, ఎంత బావుంటుంది?అనిపిస్తుంది. మీరు వంటరి వారు కాదు, నే ఉన్నాను-అని చెప్పా లని ఉంటుంది."

భాస్కరానికి ఇదో కొత్త అను భూతి.ఆమెను తేరిపార చూస్తూ అలానే కూర్చుండిపోయాడు. కాని అ త ని

మనస్సులో అనేకమయిన ఆలోచనలు పరుగెడుతున్నాయి

"కాని ఒకటి. నన్ను నేను ఇది 'ప్రేమ'నీ 'అనురాగమ'నీ మభ్యపెట్టుకోను. నాకు మీరంటే చాలా ఇష్టం."

"అంతా తెలిశాకకూడానా?"

"ఆఁ."

"అంటే...ఇది పెళ్ళిగా పరిణమించాలనా మీ కోరిక?" కొంచెం సంకోచిస్తూ అడిగాడు భాస్కరం.

"నాకు మిమ్మల్ని అర్థం చేసుకుని, మీకు సంతృప్తిని ఇవ్వగలననీ అనిపిస్తుంది."

"మీ సంతృప్తిమాట ఏమిటి?"

"నా విషయం మీకు సరిగ్గా తెలీదనుకుంటా. నాకు నటనన్నా, ముఖప్రీతి మాటలన్నా చెడ్డమంట. అందువల్లే నాకు స్నేహితులు చాలా తక్కువమంది ఉన్నారు' అందుకనే నాకు నిజాన్ని దాచకుండా చెప్పే మీరంటే నా కిష్టం కలిగింది. మీరంటే నమ్మకమూ ఉంది నాకు.

"ఆ ఇష్టం, నమ్మకం చాలుగా మన పెళ్ళి సుస్థిరంగా నిలవటానికి?"

"ప్రేమలాంటిదేమయినా ఉండాలంటారా?"

"అనే - అనుకుంటున్నా మరి."

"అసలు ప్రేమంటే ఏమిటి? అలాంటిదేమయినా ఉందేమో నాకు తెలియదు. నాకు మీ మీద వున్న ఇష్టాన్ని ఆ పేరుతో పిలవచ్చునేమో కూడా తెలియదు. నాకు మీరంటే వున్న ఇష్టాన్ని ఇక మీరు చెడగొట్టలేరనే నా నమ్మకం."

"అంటే, ఇక ముందెప్పుడూ మీ దృష్టిలో గౌరవహీనమయిన పని చేయననా ?"

"లేదు. నేను మీ పనులనీ మీ పనుల వెనుకనున్న మనఃస్థితినీ విడదీసి చూడటం నేర్చుకున్నా. మీ లోని ఆ మూలమయిన వ్యక్తిత్వం ఇక పెద్దగా మారదు. మారినా అది నా గౌరవాన్ని పెంచుతుందే కాని తగ్గించదు."

"కాని మీకు తెలుసు, నాకు మీరంటే పెళ్ళి చేసుకోవాలనిగాని, అలాంటి ఆకర్షణగాని ఏమీలేదు. మీకు తెలుసుగా ?"

"అలాంటి ఆకర్షణ పెళ్ళికి మంచి ఆధారస్తంభమని నే ననుకోవటంలేదు. మీకు నేనంటే ద్వేషంలేదు కదా ?"

"భలేవారే! నేను నా జీవితకాలంలో ఏ స్త్రీనయినా గౌరవిస్తే అది మిమ్మల్నే."

"అంతే చాలు. నేనయినా మిమ్మల్నేదో మార్చేద్దామనీ సంఘసంస్కర్తనయిపోదామనీ అనుకోవటంలేదు. అసలు మీరు కావాలని కోరుకోవటంలో నా స్వార్థమే ఎక్కువ."

"స్వార్థమా ? మీరు నన్ను పెళ్ళి చేసుకుంటే అది త్యాగం అవుతుంది అది తెలీదూ మీకు ?" తనగురించి బాగా తెలిసిన భాస్కరం బాధగా అన్నాడు.

"నాకు కావలసింది నా వ్యక్తిత్వాన్ని గౌరవించి నన్ను అర్థం చేసుకుని ఆప్యాయంగా చూడగలిగే భర్త; నా పిల్లలకు మంచితండ్రి కాగలిగే మగవాడు. ఇహ ప్రేమానురాగాలనేవి మనం ఒకళ్ళనొకళ్ళు అర్థంచేసుకోటంలో నుండి వచ్చేవేకాని హఠాత్తుగా ప్రత్యక్షమయ్యేవి కావు."

తలలో నింపుకోలేనన్ని ఆలోచనలతో 'ఇక వస్తానంటూ అక్కడినుండి

బయటపడ్డాడు భాస్కరం. ఆ రోజునే నిర్ణయించుకోలేదతను. ఆమె కూడా మళ్ళీ ఆ ప్రసక్తి తీసుకురాలేదు.

ఓ ఆర్నెల్లపాటు, ఆమెనిచూసి, ఆమె మాటల్ని విన్నాక ఓ రోజు –

"మనం పెళ్ళిచేసుకుందాం, జానకీ" అన్నాడు భాస్కరం.

"ఆ తరువాత విచారించకూడదు సుమీ."

"అలా విచారించకుండా చేసే బాధ్యత నీది. అలాంటి బరువు బాధ్యత లన్నీ నీ భుజంమీద వేసి నిశ్చింతగా ఉంటాను."

తమ మిత్రబృందానికి ఓ పెద్ద పిడుగులాంటి వార్త నందించి సివిల్ మ్యారేజి చేసుకున్నారు వాళ్లు.

జానకి నిజమయిన సమస్యలు ఆ తరువాతే మొదలయ్యాయి. పెళ్ళికి ముందు టీకి వచ్చినపుడు చూసిన భాస్కరానికి ఆఫీసుటైములో తప్ప మిగిలిన టైమంతా ఇంట్లోనే గడుపుతున్న భాస్కరానికీ ఎంతో తేడా కనిపించింది. ఒక్కోమారు సాయంకాలాలు మూడీగా కూర్చుండిపోతే ఎందుకో అర్థంకాక సతమతమయింది జానకి. ఆ తర్వాత అర్థమయింది, తన జీవిత కాలంలో బుద్ధొచ్చాక, ఎన్నడూ సాయంకాలాలు ఇంట్లో ఉండి ఎరుగని భాస్కరం ఇప్పుడు ఇంట్లో ఉండటానికి శాయశక్తులా ప్రయత్నిస్తున్నాడు. జానకి నవ్వుకుని మర్నాడు –

"ఇవాళ నేను మా సావిత్రీ వాళ్ళింటి కెళ్ళాలి; మీరూ మీ స్నేహితుల దగ్గరకు వెడతారేమో. ఇంటికి వచ్చేటప్పుడు అలా వచ్చి నన్ను తీసుకు వస్తారా?" అంది.

"ఓ, ఎస్" అన్నాడు హుషారుగా.

పెళ్ళయిన నెలకే తమ డెన్‌లో అడుగుపెట్టిన భాస్కరాన్ని చాలా ఉత్సాహంగా ఆహ్వానించి సీసాలు తెరిచారు – అతని మిత్రులు. గంగూలి తన కొత్తసాహసకృత్యం గురించి చెప్పుకుపోతున్నాడు ...

"మా ఆఫీసులో ఈ మధ్యనే శాంతి అని ఓ మద్రాసీ చేరిందోయ్. మొదట్లో ఏం ప్రతివతలా వేషం వేసే దనుకున్నాన్. పొడుగ్గా కొంగుతీసి కప్పుకునేది. అవసరమయితే తప్ప మాట్లాడేది కాదు, అదీ ముక్తసరిగా."

"ఒకళ్ళ నొకళ్ళు గౌరవించుకోని మీ సంబంధాలు, భావాలకు విలువ నివ్వని మీ సంతోషాలు ఎంత అర్థవిహీన మయినవి!" అన్న జానకిమాటలు గుర్తుకురాగానే, ఇక అక్కడ ఉండలేక బయటకు వచ్చేశాడు భాస్కరం.

చెప్పినదానికన్నా ఓ గంటముందుగానే వచ్చేసిన భర్తను చూసి ఆశ్చర్య

పోయింది జానకి. కాని మరే మీ మాట్లాడకుండా అతనితో బయలుదేరి వచ్చేసింది. ఆ రోజు చాలా హుషారుగా కబుర్లు చెప్పాడతను. కాని ఆ తర్వాత అలాంటి అవకాశాలు కల్పించినా, ఆమెతో తప్ప బయటికి వెళ్ళటానికి ఇష్టం చూపేవాడు కాదు.

ఆ మరుచటి ఏడే పుట్టిన రామం వారిబంధం మరింతబలంగా పెనవేసుకుపోయేలా చేశాడు.

"మనబాబు ఎంత అందంగా ఉన్నాడో జానీ! మరి ఎలా పట్టుకుంటున్నాడో...ఏరా, చిట్టినాన్నా, నా వేలు కావాలా?" అంటూ కొడుకుతో ఆడుకుంటున్న భాస్కరాన్ని చూసి తృప్తిగా నిట్టూర్చింది జానకి.

తరువాత వచ్చిన సుమిత్ర, బాబు ఈ సుఖసంసారంలో అల్లారుముద్దుగా పెరుగుతున్నారు. భాస్కరం ఎప్పుడయినా తన పాతజీవితంలో కొత్త జీవితాన్ని పోల్చుకుని అనుకునేవాడు.

"నా జీవితంలో నూనె అయిపోతున్న సమయంలో సరిగ్గావచ్చి వత్తి మార్చి. నూనె మళ్ళీ పోసింది జాని. లేకపోతే కొడిగట్టుకు పోయేదేమో."

"అమ్మా, చూశావమ్మా, బ్రిడ్జ కట్టేశాను," అంటూ బాబు భుజం కుదుపుతూ ఉత్సాహంగా చెప్పేసరికి మేలుకునేది జానకి.

"నిజం? చాలా బావుందిరోయ్. మరిక పడుకుంటావా?" అంటూ వాణ్ణి బుజ్జగించి పడుకోబెట్టి పిల్లల గదిలో దీపం ఆర్పి భర్తదగ్గరకు వచ్చింది జానకి.

"ఇంతకీ నా ప్రశ్నకి జవాబు చెప్పలేదు మీరు" అంది అతని పక్కన కూర్చుంటూ.

"మన పెళ్ళి విజయవంతమయిన చాలా కొద్ది పెళ్ళిళ్ళలో ఒకటి. ప్రేమా, పెళ్ళి - అంటూ గడపదాటలేక బోర్లగిలపడి గుక్కపెట్టి ఏడ్చేవాళ్ళ నెంతమందిని చూస్తున్నాం! ప్రేమ అన్నదానిమీద కాకుండా, ఒకరినొకరు అర్థం చేసుకుని గౌరవించటం అన్న భావనమీద ఆధారపడినమీద పెళ్ళి ఏ విధంగా మిగిలిన వాటికంటే తీసిపోతుంది? ఎవరంటారు అలా అని..." ఉపన్యాస ధోరణిలో చెప్పుకుపోతున్న భర్తను ఆపి.

"ఎవరో అనుకోటంమీద మనసంతోషము నిలబడి ఉందంటారా ఏం? మనకు మనం 'నేను హాయిగా గడిపాను, నా వాళ్ళని సంతోషపెట్టగలిగాను' అని ఆత్మవిశ్వాసంతో చెప్పుకోగలిగితే చాలదూ?" అంది జానకి చిరునవ్వుతో.

"ఊహుం! అలాగా!!" అంటూ గదిలో దీపం ఆర్పివేశాడు భాస్కరం.